# 8వ పుష్పము

8. ఓం శ్రీ సాయి సాధుజన పోషణాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు :
శ్రీకృష్ణస్వామి భగవద్గీతలో

శ్లో॥ యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం ॥ (4, 7)

తా॥ ఓ అర్జునా! ఏ సమయమున వర్ణాశ్రమాది ధర్మమునకు చెరుపును, అధర్మమునకు అభివృద్ధియు గలుగుచున్నదో, అప్పుడునన్ను నేను సృష్టించుకొను చున్నాను. (నేనొక రూపముతో వెలువడుచున్నాను. లేక అవతరించుచున్నాను). లేక నేను నన్ను మాయచేత సృజించుకొనుచున్నాను. జనులకు కనబడుచున్నాను.

అధర్మము వలన సాధువులు బాధపడతారు. సాధువులనగా సన్మార్గమున నుండు వారు భగవంతుని ఆశ్రయించుకొనియు, భగవంతుని నెదురుచూచుకొనియు, తమ దేహ సంరక్షణలో నాసక్తిని విడచి భగవంతుని చూడని క్షణకాలమును అనేక కల్పములుగ నెంచియు, దేహేంద్రియములను అణచియున్న వారు సాధువులు.

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశ చ దుష్కృతాం ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యగే ॥ (4:8)

తా॥ అటువంటి సాధువుల రక్షణకొరకును, దుష్టుల నాశము
కొరకును (అనగా వారిని రక్షించి, సన్మార్గమున తెచ్చుటకై)
ధర్మమును నిలబెట్టుటకొరకును, ప్రతి యుగమునందు అవతరించుచున్నాను.

శ్లో॥ అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥

(9-22)

తా॥ ఏ జనులు తాము భగవంతుని కంటె వేరైనవారలు (సాధువులు) కారని భగవంతునే ధ్యానించి ఎడతెగక నంతతనుపాసించుచున్నారో, ఎల్లప్పుడు ధ్యాన నిష్ఠగల అట్టివారల యోగక్షేమమును భగవంతుడే వహించుచున్నాడు. మంచి గుణములు గలవారందరు సాధుజనుల క్రిందనే వస్తారు. అట్టివారిని పోషించే సాయి పరమేశ్వరునకు నమస్కారము.

2) కవీశ్వరుడు
స్వామి దివ్యవాణి వినండి.

"ఉన్నాడయా దేముడున్నాడయా
కన్నుల కనిపించకున్నాడయా ।
లోకాల చీకట్లు పోకార్చ రవిచంద్రు దీపాలు
గగనాన త్రిప్పచున్నాడయా ॥
లక్షలాదిగనున్న నక్షత్రముల నెల్ల నేల
రాల్చకమింటనున్నాడయా ।
ఈ ధారుణీచక్రం యిరుసులేకుండగను
ఎల్లవేళల త్రిప్పచున్నాడయా ॥
జీతభత్యములు లేక ప్రీతితో మనవైపు

గాలిలో సురటేలు విసిరేనయా ।
ఆధారమే లేక అలరుచున్నట్టి
ఆకాశమును ఆపుచున్నాడయ్యా ।
పొంగిపొరలు పృథ్వి పైపడకుండ
కడలిరాజు కాళ్ళుముడిచాడయా ।
తెరచాటు తానుండి తెరముందు జనముంచి
తైతక్కలాడించుచున్నాడయా ।
విశ్వమును వింత సృష్టించే విశ్వకర్త తానై
పోషించి నడిపించే ధర్మమూర్తి
దివ్య చైతన్యవంతమై దీప్తి కలుగ
విశ్వశాంతి యొనగూర్చె విశ్వవిభుడు ॥"

ఇది సృష్టి - సృష్టికర్త - ఒకసారి స్వామి పంచాక్షరీ మంత్రముపదేశించారు. అదే "దేముడున్నాడు" అనేదే ఆ మంత్రం.

3) సకలతత్త్వ బోధకుడు :

"దోషాలను అన్నిటికి మూలము అహంకారం" సేవద్వారా, మొట్టమొదట అహంకారమును దూరం చేసుకోవాలి. అంతేకాదు బియ్యమునకు పైపొట్టు వున్నంతవరకు (ఊక), ఎక్కడ వేసినా మొక్కలుగా పెరిగి, ఒక్క గింజకు అనేక గింజలుగా తయారు అవుతాయి. మానవుని యందు ఏ కించిత్, అహంకారము వున్నాఅది అనేక మార్పులు చెందుతుంది. అనేక దోషాలను కూర్చి అనేకజన్మలను వృద్ధి చేస్తుంది. కావున మొదట అహంకారమును నిర్మూలన చేసుకోవాలి. చంద్రుడు దిన దినమును అభివృద్ధి చెంది, పౌర్ణమి నాటికి, పరాకాష్ఠము నందుకుంటాడు. "చంద్రమా మనసో జాతః". అదేవిధముగనే మానవుని మనస్సు కూడా, దినదినాభివృద్ధి గాంచి విశాలమైన దివ్యమార్గమును అనుసరించి పూర్ణముగా రూపొందాలి. పరిపూర్ణమైన మానవ జీవితమునందే పరిపూర్ణమైన దివ్యత్వము కూడా ప్రకాశిస్తుంది. మానవుని పూర్ణత్వమంటే ఏమిటి? విశాలమైన హృదయమే సంకుచిత భావములతో నింపుకున్న మనస్సు ఏనాటికి శాంతి సంతోషములనందుకోలేదు. సర్వసాధనముల తత్త్వ శాస్త్రముల మూలము సమస్త ధర్మముల గమ్యము హృదయ విశాలత్వమే. కావున మానవుడు విశాల హృదయుడు కావాలి. అప్పడే పరిపూర్ణత్వాన్ని అందుకోటానికి అర్హుడౌతాడు.

4) సర్వజ్ఞుడు

అహంకార వర్జితులే ముక్తులు. విశాల హృదయులే ముక్తులు. పొరపాటున కూడా ఈ అహంకారమును దరి చేర్చుకోకూడదు. అప్పడే దేహాత్మభావము ఉండదు. పరిపూర్ణత్వము అందుకుంటాడు. "సర్వ వేదాంత సిద్ధాంత సార సంగ్రహము" (శ్రీ శంకరులు) ఈ విషయము గూర్చి ఇట్లు వచించుచున్నది.

శ్లో॥ నప్రమాదోత్రకర్తవ్యా విదుషా మోక్ష మిచ్ఛతా ।
ప్రమాదే జృంభతే మయా సూర్యాపాయే తయోయధా ॥

(892)

తా॥ ముక్తిని (ఇదే హృదయ విశాలత్వము) కోరువారు పొరపాటు ఎంత మాత్రము చెందరాదు. ఏలయన సూర్యుడు అస్తమించినచో చీకటి విజృంభించి నేత్ర దృష్టిని అడ్డగించునటుల సమాధి విషయమై (పరిపూర్ణత్వ విషయమై) ఏమరుపాటు చెందినచో వెంటనే యజ్ఞానము విజృంభించి బ్రహ్మస్వరూపమును (మోక్షమును) నావరించుచున్నది.

శ్లో॥ అస్మిన్ సమాధే కురుతే ప్రయాసమ్ ।
అన్తస్య నైవాస్తి పునర్వికల్పః ॥
సర్వాత్మభావోప్యమునైవ సిద్ధ్యేత్ ।
సర్వాత్మభావః ఖలుకేవలత్వం ॥ (893)

తా॥ ప్రయత్నము చేయువారికి తిరుగ దేహాత్మ భావము కలుగదు. "ఇదయ సర్వం యదయమాత్మ" (మాం.ఉ. 2) ఇత్యాదిశ్రుతిబోధితంబగు సర్వాత్మాభావము కలుగుతుంది. ఇదేకదా విశాల హృదయత్వము (ముక్తి). ఇది అహంకారము ఏకొద్దియున్నా రాదు.

శ్లో॥ సర్వాత్మభావో విదుషో బ్రహ్మవిద్యాఫలం విదుం
జీవన్ముక్తస్య తస్యైవ స్వనన్దానుభవః ఫలమ్ ॥ (894)

తా॥ "సకలం ఆత్మయే" అను భావము కలుగుటయే ఫలం, ఇటువంటి జీవన్ముక్తులు (విశాల హృదయులు) స్వరూపంబగు ఆనందము అనుభవింతురు.

5) ప్రేమ స్వరూపుడు

"భిన్నత్వంలో అభిన్నత్వం చూడటం నేర్చుకోవాలి. అన్నిటిలోను వ్యత్యాసమున్నట్లు కనబడుచున్నది. దీనికి కారణ మేమి? తనకును, భగవంతునకును మధ్యయున్న సంబంధమును గూర్చి భావించడంలో కల్పన చేసికొనడంలో అనుసరించు మార్గంలో భిన్నత్వము కలిగియుండుటయే - మానువుడు ఏ మార్గమునైనా నిష్కల్మష హృదయం తో, నిర్మలభావంతో ప్రేమతో నిండిన మనస్సుతో శరణాగతుడై అనుసరించిన యెడల గమ్యమైన దైవత్వము చేరుకొనుట తథ్యము."

దివ్యలీల : అటువంటి ప్రేమస్వరూపుడే ఒకరోజు ఫిల్మ్ లేని కెమేరాతో తన ఫొటోలు సృష్టించి భక్తులకు పంచి పెట్టారు.

దివ్య చికిత్స : నవనగరు మహారాజు జామ్‌సాహెబ్‌కు పైత్యపుతిత్తిలోరాయివలన అపరిమితంగా బాధపడుతుండగా స్వామి వీభూతి సృష్టించి దానిని పొత్తి కడుపుపై రుద్దితే బాధ మాయమైనది. ఆ దివ్యచికిత్స వల్ల రాజుభార్య, భక్తు లైనారు. రాజు అంత్యదశలో స్వామి వచ్చి దర్శనమిచ్చారు. తరువాత సోమనాధ దేవాలయం ప్రతిష్ఠచేసి పూజించా రు తనకు తానే.

6) సకలజన ప్రియుడు : (బి.కె.మిశ్రా)

తన అనుభూతులు చెప్పతూ అంటారు "మానవుని కోసమే
స్వామి అవతారం. స్వామి చెప్పింది అంతా వ్రాస్తే చాలాఅవుతుంది. బోధలు బాగా వున్నాయి. కరుణ, ప్రేమ అపారం. 30 సంవత్సరములు (అప్పటికి) పైగా స్వామి వ్రాస్తున్నారు,మాట్లాడుతున్నారు, చేస్తున్నారు. అన్నిటిలోను వున్న సారాం శము ఒక్కటే. మానవుని సమస్యలలో ఏకత్వం చూడాలి. ఆ సమస్యలు రాజకీయం గాని, ఆర్థికంగాని, సాంఘికం గాని, విద్యా విషయాలు కానివ్వండి భిన్నత్వంలో ఏకత్వం చూడాలి,మాట్లాడాలి, చెయ్యాలి. ఇవి అన్ని సత్యరూపాలే కదా! ఇదే స్వామి మానవాళికి అందిస్తున్న సందేశం. అది దైవప్రేరితమైనది. కాదు - పరమేశ్వరుడే స్వయముగా చెప్పతున్నారు. మనమంతా ఆ దివ్య సందేశము అందుకొని సాధన ద్వారా జీవితాన్ని అంకితము చేసుకోవాలి."

7) స్తుతి ప్రియుడు :

భజన గురించి చెప్పతూ స్వామి "నాలుక పవిత్రంగా వుండాలంటే నామస్మరణే ముఖ్యం" జయదేవుడన్నాడు "రసజ్ఞే మధురప్రియత్వం సత్యం హి వందే త్వాం పరమోదం నమామి ఆవర్ణయేత్ మధురాక్షరాణి గోవిందా దామోదంం మాధవేతి" అన్నారు. = రసజ్ఞత్వం కలిగి సత్యమెరిగిన ఓ నాలుకా! పవిత్రము త్యాగ రూపమై గౌరవ మర్యాదలను కాపాడుకొనే ఓ నాలుకా! గోవిందా, దామోదరా అనే నామాన్ని స్మరించు" అని నాలుకను గూర్చి

ప్రబోధించాడు. ప్రధానమైనది సాదన, నామస్మరణతో, నాలుక పవిత్రత మరింత అభివృద్ధి చెందుతుంది. నిరంతరము హరినామసంకీర్తన చేయాలి. "హరేర్నామ, హరే ర్నామ, హరే ర్నామైవ కేవలం" నామస్మరణ కంటెఅధికమైన సాధన మరొకటి లేదు. గోవిందా నష్టాంవైధరణీం పూర్వమవిన్దం వైగుహాగతః గోవింద ఇతి = అసురుని చేత నెత్తుకొని పోబడిన భూదేవిని పైకెత్తినవాడు గోవిందుడు. తేనాహందేవైర్వాగ్భి రభిష్టుతా ఇతిమోక్ష ధర్మవచనాత్ గోవిందః = నేను వేల్పులకు యింద్రుడనయినట్లు, నీవు గోవులకు యింద్రుడవగదువు. కావున నిన్ను గోవిందుడందురని ఇంద్రుడు విష్ణువుతో చెప్పెను. కావున గోవిందుడయ్యెను

దామోదర = దమాదిసాధనే నోదరా ఉత్కృష్టామితి ర్యాతమాగమ్యతఇతి = దయాది సాధనములచే గలిగిన జ్ఞానముచే బొందదగినవాడు. యశోద చేత్రాటితో నడుమున గట్టబడినవాడు, నామములనగా లోకములు - వానినితనయందుంచుకున్న వాడు.

దివ్యభజన : కరుణాసింధో దశరధనందన పర్తిపురీశ్వర, రాం ॥
ప్రేమస్వరూప ప్రశాంతినికేతన మారుతి, సేవిత రాం ॥
అహల్యోద్ధారక రాజీవలోచన రఘుకుల భూషణ రాం ॥క॥

8) వేదాంతవేద్యుడు

ఆ సాయిపరమేశ్వరుని జ్యోతులకు జ్యోతి స్వయంజ్యోతి అన్నది వేదాంతం. కఠోపనిషత్తులో యిట్లా యున్నది.

శ్లో॥ "న తత్ర సూర్యోభాతి న చంద్రతారకం । నేమావిద్యుతోభాన్తి
కుతోయ మగ్నిః । తమేవభాంత మనుభాంతిసర్వం । తస్యభాసా
సర్వమిదంవిభాతి ॥ (2-1-15)

తా॥ స్వాత్మభూతుడగు ఆ పరమేశ్వరునందు, ప్రపంచము నందు గల సకల పదార్థములను ప్రకాశింప చేయు సామర్థ్యముగల సూర్యుడు ప్రకాశించుటలేదు. అదే విధముగా చంద్రుడుగాని,నక్షత్రములు గాని, మెరుపులు గాని ఆత్మను ప్రకాశింప చేయజాలవు. ఇక మన దృష్టి గోచరమునందున్న అగ్ని ఎట్లు ప్రకాశింపచేయగలడు? ఇవి అన్నియు ఆ పరమేశ్వరుని అనుసరించియే ప్రకాశించుచున్నవి అందుచే ఆ బ్రహ్మము "భాతి, విభాతి' అని చెప్పబడుచున్నది. అతడు స్వయంప్రకాశుడు. ఆ పరమేశ్వరుని ప్రకాశము చేతనే సూర్యుడు మొదలగునవి ప్రకాశించుచున్నవి.

ఓం తత్సత్